Office : 9440815774 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం వ్యవస్థాపకులు : డి. విజయ్ కుమార్

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APETL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక

ప్రచురణ : చిత్తూరు, తిరుపతి సంపుటి : 02 సంచిక : 66 ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు ఆదివారం 11 అక్టోబర్ 2026 పేజీలు : 4 వెల : 2




## అక్టోబర్ 2028 నాటికి

# రాజధాని పూర్తి చేయడమే లక్ష్యం



- ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నాం
- అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని నారాయణ ఆదేశాలు
- ఐకానిక్ టవర్ల పనులను పరిశీలించిన మంత్రి నారాయణ



## విమానంలో పైలట్ స్మిత్‌పై దాడి

# కేసు నమోదు చేసిన ఎన్ఐఏ

- విమానం గాల్లో ఉండగానే కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై కో పైలట్ కత్తితో దాడి చేసిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించింది.
- ఘటన వెనుక ఏదైనా పెద్ద కుట్ర ఉందా అనే అంశాన్ని కూడా ఎన్ఐఏ పరిశీలించనుంది.

## ప్రకృతి సేద్యంలో దేశంలోనే

# ఏపీ అగ్రస్థానం

- ప్రకృతి సేద్యంలో ఏపీ నంబర్ 1, 25 లక్షల మంది రైతులు లక్ష్యం: సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులను భాగస్వాములను చేయడమే లక్ష్యం
- రసాయనాలతో పోలిస్తే ప్రకృతి సాగుతో 47 శాతం పెరిగిన రైతుల ఆదాయం
- రసాయన ఎరువుల వాడకం తగ్గించినందుకు కేంద్రం నుంచి రూ.218 కోట్ల ప్రోత్సాహకాలు
- జీవామృతం తయారీ కోసం రాష్ట్రంలో మరిన్ని గోకులాలు నిర్మిస్తామని వెల్లడి



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులను ప్రకృతి సేద్యం వైపు ప్రోత్సహించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రకృతి సేద్యం, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎండీఎస్)పై ఆయన శనివారం టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, రైతులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 2016లో కేవలం 40 వేల మంది రైతులతో ప్రారంభమైన ఈ ప్రస్థానం నేడు 17.73 లక్షల మందికి చేరిందన్నారు. కొందరు గతంలో ఇది విజయవంతం కాదని దుష్ప్రచారం చేసినా, రైతులు అద్భుతమైన ఫలితాలు సాధించారని కొనియాడారు. రసాయన ఎరువులతో భూసారం క్షీణించి, సాగు ఖర్చులు పెరిగి రైతులకు భారం అవుతోందన్నారు. కానీ ప్రకృతి సేద్యం ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గి ఆదాయం గణనీయంగా పెరుగుతోందని వివరించారు. “రసాయన ఎరువులతో పోలిస్తే ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు సగటున 47 శాతం మేర ఆదాయం పెరిగింది. పత్తి పంటలో 96 శాతం, కందుల్లో 87 శాతం నికర ఆదాయం లభించింది. తీవ్రమైన కరవు పరిస్థితులను సైతం తట్టుకుని ఈ విధానంలో మంచి దిగుబడులు వస్తున్నాయి,” అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి - మిగతా3లో

## పాకిస్థాన్‌లో మరో దారుణం..

- క్రైస్తవుడి ఇల్లు, షాప్‌కు నిప్పు.. 35 కుటుంబాల వలస
- పాకిస్థాన్‌లో క్రైస్తవుడిపై దైవదూషణ ఆరోపణలు
- ఆగ్రహంతో ఇల్లు, దుకాణాన్ని తగలబెట్టిన ముస్లిం మూక
- భయంతో 35కు పైగా క్రైస్తవ కుటుంబాలు గ్రామం విడిచి పరారీ
- భారీగా పోలీసుల మోహరింపు, దర్యాప్తు ప్రారంభం
- దైవదూషణ చట్టాల దుర్వినియోగంపై తీవ్ర ఆందోళన





## మొగాంబో మోదీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారు

- చేసిన నేరాలకు మూల్యం చెల్లించాల్సిందే’
- చెన్నైలో జరిగిన ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- దేశంలో ప్రజల గొంతులను అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది
- గత 15 ఏళ్లుగా ఆయన సాగిస్తున్న నాటకం ముగింపు దశకు చేరుకుంది



## గెలిస్తే నిజాయతీ ఓడితే అవకతవకలా

- ఈసీకి మద్దతుగా 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్‌ల బహిరంగ లేఖ
- భారత ఎన్నికల సంఘానికి, సర్ ప్రక్రియకు మద్దతుగా 124 మంది సభ్యుల మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల బృందం ఒక బహిరంగ లేఖను విడుదల
- ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా ఓట్ల చోరీ జరిగిందని, ఎన్నికల రిగ్గింగ్ అని ఆరోపణలు చేయడం సరికాదు

## నవంబర్ 15 నాటికి

# ఎన్నికలు పూర్తి



- అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్‌ఛార్జ్ మంత్రులదే
- స్థానిక ఎన్నికలకు ముఖ్యమంత్రి చంద్రబాబు డెడ్‌లైన్ ఫిక్స్ చేశారు
- గెలుపు టార్గెట్ 100 శాతంగా నిర్ణయించారు
- నవంబర్15 నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి, పాలనపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.
- కేబినెట్ భేటీ ముగిశాక సహచర మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చలు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

స్థానిక ఎన్నికలకు ముఖ్యమంత్రి చంద్రబాబు డెడ్‌లైన్ ఫిక్స్ చేశారు. గెలుపు టార్గెట్ 100 శాతంగా నిర్ణయించారు. నవంబర్ 15 నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి, పాలనపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. బీసీ రిజర్వేషన్ల నుంచి కూటమి పార్టీల సమన్వయం వరకు ఎన్నికల వ్యూహంపై కీలక సూచనలు చేశారు. ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొంటూనే నియోజకవర్గాల అభివృద్ధికి నిధుల విడుదలపైనా కీలక ప్రకటన చేశారు. కేబినెట్ భేటీ ముగిశాక సహచర మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చలు జరిపారు. స్థానిక సంస్థల ఎన్నికలే అజెండాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సన్నద్ధత, - మిగతా3లో



## పార్టీ అభ్యర్థులకు లీగల్ సెల్ రక్షణ

# కవచంలా నిలవాలి

- స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకమైన దశలోకి వెళ్తున్నాయి
- పార్టీ లీగల్ సెల్ ఇక సాధారణ అనుబంధ విభాగంగా కాకుండా ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని న్యాయపరంగా పర్యవేక్షించే వ్యవస్థగా పనిచేయాలి
- రాష్ట్రంలో చట్టాలు, నిబంధనలు, ఎన్నికల వ్యవస్థలు ఉన్నప్పటికీ అవి సక్రమంగా అమలవడం లేదు
- 2024 ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు, దాడులు, వేధింపులు జరిగాయని, అలాంటి పరిస్థితుల్లో లీగల్ సెల్ కార్యకర్తలకు అండగా నిలిచింది
- వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

# నలుగురు మాజీ సీఎంలు, 7వేల మంది అరెస్ట్

- ఢిల్లీలో ఉద్రిక్తతకు దారితీసిన సీజేపీ నిరసన
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాలో అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీజేపీ చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి
- నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



# కుప్పంలో లయన్స్ క్లబ్ సేవా యజ్ఞం..

●100 మందికి వైద్య పరీక్షలు,

●15మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు!



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్10:** ప్రపంచ దృష్టి దినోత్సవం, ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్ ఆధ్వర్యంలో, పీఈఎస్ వైద్య కళాశాల, ఆసుపత్రి సహకారంతో కుప్పంలో ఉచిత కంటి వైద్య శిబిరం, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 100 మందికి పైగా మున్సిపల్ ఉద్యోగులు, ప్రజలకు వైద్య పరీక్షలు చేయగా, 15 మందిని ఉచిత కంటిలో శుక్లాల శస్త్రచికిత్సలకు వైద్యులు సిఫార్సు చేశారు. అనంతరం డాక్టర్ సాహిత్య మున్సిపల్ ఉద్యోగులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఒత్తిడిని అధిగమించడం, సానుకూల ఆలోచనలు, మానసిక ప్రశాంతత ఆవశ్యకతను వివరించారు. శిబిరానికి వచ్చిన రోగులు, వారి సహాయకులకు లయన్ అజిత్ ఆనంద్ కుటుంబ సభ్యుల సహకారంతో భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సలహాదారు ఎ.మహేష్,అధ్యక్షుడు పి.జి. సెల్వం, డైరెక్టర్లు ప్రసాద్, సుబ్రమణ్య, జయరామ్ నాయుడు, ఏకాంబరం, ప్రకాష్, వైద్యులు మంజునాథ్, సాయి రఘు, లయన్ బాబు, శాంతిపురం లయన్స్ క్లబ్ సభ్యులు, పీఈఎస్ ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు.

# మొరసనపల్లి రైతు బిడ్డకు జనసేనలో కీలక బాధ్యత



**శాంతిపురం,చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్10:** కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం మొరసనపల్లికి చెందిన జగ్గన్నగారి మధు కుమార్‌కు జనసేన పార్టీ తరపున చిత్తూరు పార్లమెంట్ ఎన్నికల కమిటీలో సభ్యుడిగా అవకాశం లభించింది. మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన ఆయన బిట్స్ పిలానీలో ఇంజినీరింగ్ పూర్తి చేసి, ప్రస్తుతం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి సిద్ధాంతాల పట్ల అంకితభావంతో పనిచేస్తున్న ఆయనకు కీలక బాధ్యత దక్కడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. తనపై నమ్మకం ఉంచిన జనసేన అధ్యక్షు డు పవన్ కళ్యాణ్, రాష్ట్ర నాయకత్వానికి మధు కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కుప్పంతో పాటు చిత్తూరు పార్లమెంట్ పరిధిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# లోకేష్ కుటుంబానికి రెడ్డిపల్లి గ్రామస్థుల ఆర్థిక సహాయం



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,అక్టోబర్ 10:** చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం రెడ్డిపల్లి హరిజనవాడకు చెందిన జి. లోకేష్ ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు రెడ్డిపల్లి గ్రామస్థులు ముందుకొచ్చారు. గ్రామం తరఫున బాధిత కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన రెడ్డిపల్లి గ్రామస్థులకు లోకేష్ కుటుంబ సభ్యులు, హరిజనవాడ గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. బాధిత కుటుంబానికి సహాయం అందించడం పట్ల గ్రామస్థుల మానవత్వాన్ని పలువురు అభినందించారు.

# అయ్యప్ప భక్తుల సంఘం తిరువూరు అధ్యక్షుడిగా జగదీష్ భరద్వాజ



**తిరువూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 10:** అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం (ABABS) తిరువూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా వల్లెపు జగదీష్ భరద్వాజ నియమితులయ్యారు. ఈ విషయాన్ని సంఘం జాతీయ అధ్యక్షుడు అడ్వకేట్ వాండ్రాసి పెంచలయ్య వెల్లడించారు. ఈ సందర్భంగా జగదీష్ భరద్వాజ మాట్లాడుతూ అయ్యప్ప భక్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సంఘం బలోపేతంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు. తనకు ఈ బాధ్యత అప్పగించిన జాతీ య అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

# పీపీఎస్ సభ్యులకు ఎమ్మెల్యే అమర్ అభినందనలు

**స్వచ్ఛాంధ్ర జిల్లా స్థాయి అవార్డు సాధించడం అభినందనీయం**





**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 10:** స్వచ్ఛాంధ్ర జిల్లా స్థాయి అవార్డును సాధించిన పలమనేరు పరిరక్షణ సమితి (పీపీఎస్) సభ్యులను పలమనేరు ఎమ్మెల్యే ఎన్. అమరనాథ రెడ్డి శనివారం అభినందించారు. సమితి సభ్యులు అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. పలమనేరు నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములవుతూ,.. ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ పీపీఎస్ సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో గుర్తింపు పొందడం సమితి సభ్యుల కృషికి నిదర్శనమని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీపీఎస్ నాయకులు ఆనందబాబు, నరసింహులు, నారాయణ, రామచంద్ర, విజయకుమార్ రెడ్డి, పొన్ముడి, రెడ్డెప్పనాయుడు, వెంకటేష్ పాల్గొన్నారు.






# కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో మహిళల బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు ప్రారంభం

## విశ్వవిద్యాలయ జట్టులో చోటు కోసం క్రీడాకారిణుల ప్రతిభా ప్రదర్శన

**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 10:** కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో మహిళల షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రాంగణంలోని సచిన్ టెండూల్కర్ అంతర్గత క్రీడా ప్రాంగణంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, అనంతపురం మహిళల బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో ప్రతిభావంతులైన క్రీడాకారిణులు పాల్గొని విశ్వవిద్యాలయ జట్టులో స్థానం సంపాదించేందుకు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు.బీసీఎన్ విద్యాసంస్థల సమూహం వ్యవస్థాపకులు, అధ్యక్షులు డాక్టర్ బి.సి. నాగరాజ్, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. సునీల్ రాజ్ మార్గదర్శకత్వంలో, కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎస్. సుధాకర్ బాబు, ఉప ప్రధానాచార్యులు డాక్టర్ ఎస్. భాస్కరన్ పర్యవేక్షణలో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.సి. నాగరాజ్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందు తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. డాక్టర్ ఎన్.సునీల్ రాజ్ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయ స్థాయి ఎంపిక పోటీలు క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు చక్కని వేదికగా నిలుస్తాయని తెలిపారు. ముఖ్యంగా మహిళా క్రీడాకారిణులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి ఉన్నత స్థాయి పోటీల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎస్.సుధాకర్ బాబు మాట్లాడుతూ, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం మహిళల బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక పోటీల నిర్వహణ బాధ్యత తమ కళాశాలకు అప్పగించడం గర్వకారణమని పేర్కొన్నారు. పోటీలను నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన క్రీడా సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ఈ పోటీలకు జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, అనంతపురం క్రీడా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ టి. నారా యణరెడ్డి విశ్వవిద్యాలయ పరిశీలకుడిగా హాజరయ్యారు. విశ్వవిద్యాలయ శారీరక విద్య సంచాలకులు బి. జోజి రెడ్డి ఎంపిక కమిటీ సభ్యునిగా వ్యవహరించారు. కళాశాల శారీరక విద్య సంచాలకులు సి.సతీష్ కుమార్ పోటీల నిర్వహణ సమన్వయకర్తగా వ్యవహరించగా, డాక్టర్ సి.జి. శరవణ, వి. సత్యమూర్తి, డాక్టర్ పి. అజయ్ కుమార్ రెడ్డి, వివేక్, వి. పాండియన్, పి. సుధాకర్ తదితరులు నిర్వహణ కమిటీలో సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించారు. కళాశాల వివిధ విభాగాల అధిపతులు, విభాగ బాధ్యులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పోటీల నిర్వహణకు సహకరించారు. మహిళా క్రీడాకారిణుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీసి, విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపిక చేయడమే లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా ప్రోత్సహించేందుకు కళాశాల కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## కుప్పం పరిధిలో పోలీసుల కార్డన్ సెర్చ్..

# 5వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

**రౌడీషీటర్ల కదలికలపై నిఘా.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు**







**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్10:** చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ పరిధిలో అక్రమ మద్యం తయారీ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. రామకుప్పం పోలీస్ స్టేషన్ పరిధిలోని యానాది కాలనీ, గుడ్దూరు అటవీ ప్రాంతాల్లో కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 5,000 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు కుప్పం సబ్ డివిజన్ ఏఎస్పీ హేమంత్ బొడ్డు, ఐపీఎస్ పర్యవేక్షణలో ఈ తనిఖీలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, రౌడీషీటర్ల కదలికలు, ప్రస్తుత కార్యకలాపాలపై ఆరా తీశారు. అక్రమ మద్యం తయారీ, విక్రయాలు సహా చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిఘా మరింత కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ మాట్లా డుతూ.. అక్రమమద్యం తయారీ, విక్రయాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తుపదార్థాలకు, అక్రమ మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు, అక్రమ మద్యం తయారీని అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ఈ ఆపరేష న్‌లో రామకుప్పం ఎస్ఐ మరెప్ప, రాళ్లబూదు గూరు ఎస్ఐ నరేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు బీజేపీ

# రాష్ట్ర నాయకుడు సురేష్ వర్మ సన్మానం



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్10:** ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను బీజేపీ రాష్ట్ర నాయకుడు సురేష్ వర్మ మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. శుక్రవారం సాయంత్రం తిరుపతిలోని చెన్నై ఫెర్టి లిటీ సెంటర్ ఆసుపత్రిలో ఎమ్మెల్యేను కలిసిన ఎస్ఆర్ పురం మండలం ఊడమలకుర్తి మాజీ సర్పంచ్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేష్ వర్మ ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సూచించినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని సురేష్ వర్మకు సూచిం చారు. ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకా లపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

# బాలికల విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 10:** శ్రీకాళహస్తి బాలికలు విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. శ్రీకాళహస్తి రూరల్ మండలం బీవీ పురం గిరిజన కాలనీలో ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, క్రై సంస్థ సహకారంతో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, బాలికలు చదువుపై దృష్టి సారించి అన్ని రంగాల్లో రాణించాలని, బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళా కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ, బాల్యవివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటాయని తెలిపారు. బాలికల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బాలికల విద్యను ప్రోత్సహించడం, బాల్యవివాహాలను అరికట్టడంపై ప్రతిజ్ఞ చేసి, అవగాహన నినాదాలతో మానవహారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ కో-కన్వీనర్లు రామచంద్ర, వెంకటేష్, మురుగయ్య, ఎస్ఎంసీ కమిటీ సభ్యుడు చలపతి, గ్రామస్తులు, బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కామి దళితవాడలో అంగన్వాడీ ఉత్సవం

**అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లకు కోలా ఆనంద్ సత్కారం**



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 10:** శ్రీకాళహస్తి జాతీయ పోషణ మాసాన్ని పురస్కరించుకుని మన అంగన్వాడీ -- మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలోని కామి దళితవాడ అంగన్వాడీ కేంద్రంలో శనివారం అంగన్వాడీ ఉత్సవాన్ని నిర్వహించారు. లింగాబత్తిన గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్ల సేవలను గుర్తిస్తూ వారికి జాకెట్లు, పసుపు కుంకుమ, స్వీట్లు, పండ్లు, దేవస్థానం శేషవస్త్రాలను అందజేసి కోలా ఆనంద్ ఘనంగా సత్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, చిన్నారులకు పోషకాహారం అందించడం, వారి ఆరోగ్యాన్ని సంరక్షించడం, ప్రాథమిక విద్యాభివృద్ధికి తోడ్పడటంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను సమాజ ఆధారిత పోషణ, సంరక్షణ కార్యక్రమాలకు కేంద్ర బిందువులుగా తీర్చిదిద్దడం లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. పోషకాహారం ప్రాముఖ్యత, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, సమతుల ఆహారం తీసుకోవాల్సిన అవసరంపై తల్లిదండ్రులు, స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు రాఘవనాయుడు, కుప్పం హరీష్ రెడ్డి, వేదం కృష్ణయ్య, సీనియర్ నాయకులు జీవీ అమర్నాథ్, లింగాబత్తిన గోపాల్, కన్నా వెంకటేశ్వర్లు, పుణ్యం ఢిల్లీ కుమార్ రెడ్డి, ఇమ్మిడిశెట్టి మోహన్, నాగలాపురం గోవర్ధన్, ఫ్లెక్సీ కృష్ణారెడ్డి, పెద్దదాసరి శివారెడ్డి, డక్కిలి శివా, కైవూరి తులసి, కామి వెంకట్రాయులు, హరి తదితరులు పాల్గొన్నారు.

# ధన్వంతరి జయంతికి అధికారిక గుర్తింపు కల్పించాలి

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 10:** శ్రీకాళహస్తి ఆయుర్వేద వైద్యానికి అధిదేవతగా హిందూ సంప్రదాయంలో పూజలందుకునే శ్రీ ధన్వంతరి జయంతికి రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గుర్తింపు కల్పించాలని నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు.గత ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీ మేరకు ధన్వంతరి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. నాయీ బ్రాహ్మణ సమాజం శ్రీ ధన్వంతరిని తమ కులదైవంగా, వైద్య నారాయణుడిగా పూజిస్తుందని తెలిపారు.ధన్వంతరి జయంతికి అధికారిక గుర్తింపు కల్పించడం నాయీ బ్రాహ్మణుల చిరకాల వాంఛ అని పేర్కొన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చి, రాష్ట్రవ్యాప్తంగా ధన్వంతరి జయంతిని అధికారికంగా, ఘనంగా నిర్వహించేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని కోట చంద్రశేఖర్ కోరారు.

# నవంబర్ 15 నాటికి ఎన్నికలు పూర్తి

-మొదటిపేజీ తరువాయి

బీసీ రిజర్వేషన్లు, రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికలను మంత్రులు, ఎమ్మెల్యేలు సీరియస్‌గా తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలని సూచించారు. ఈ ఎన్నికల ద్వారా కొత్త నాయకత్వం తెరపైకి వస్తుందని స్పష్టం చేశారు. కూటమిలోని మూడు పార్టీల మధ్య సమన్వయమే ఎన్నికల్లో కీలకమని చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మంత్రులు పరస్పరం సంప్రదింపులు జరుపుతూ ముందుకు వెళ్లాలని సూచించారు. కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదేనని తేల్చిచెప్పారు. ఏ ఒక్క స్థానాన్ని కోల్పోవడానికి వీల్లేదని, అన్ని స్థానాల్లోనూ విజయం సాధించేలా సమష్టిగా పనిచేయాలని ఆదేశించారు.

### పార్టీ పరంగా సాధ్యమైనంత ఎక్కువ రిజర్వేషన్లు

బీసీ రిజర్వేషన్ల అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికలోని వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా వైఎస్సార్సీపీ అడ్డంకులు సృష్టిస్తోందని చంద్రబాబు విమర్శించారు. గతంలో బీసీలకు అమలైన 34 శాతం రిజర్వేషన్లను జగన్ ప్రభుత్వం తగ్గించిందని, హైకోర్టు కొట్టివేసిన జీవోలపై సుప్రీంకోర్టును ఆశ్రయించలేదని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్ల కోసం ప్రయత్నిస్తుంటే వైఎస్సార్సీపీ కోర్టును ఆశ్రయించిందని ఆక్షేపించారు. వైఎస్సార్సీపీ న్యాయస్థానాన్ని ఆశ్రయించకుండా ఉంటే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలయ్యేవని వ్యాఖ్యానించారు.

బీసీలకు పార్టీల పరంగా సాధ్యమైనంత ఎక్కువ రిజర్వేషన్లు కల్పించాలని చంద్రబాబు సూచించారు. ఎస్ఐఆర్ తర్వాత వెలువడే ఓటర్ల జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహించాలని జగన్ కోర్టును ఆశ్రయించడంపై సీఎం విమర్శలు చేశారు. ఓటమి భయంతోనే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని



ఆరోపించారు. జిల్లా పరిషత్‌ల సంఖ్య పెరిగినందున జడ్పీ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు కొత్త రోస్టర్ రూపొందించాల్సిన అవసరం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

### రాష్ట్రంలో 34 శాతం లోటు వర్షపాతం

ఎల్‌నినో పరిస్థితులపై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో 34 శాతం లోటు వర్షపాతం ఉన్నప్పటికీ గత ఏడాది నీటిని నిల్వ చేసుకోవడం వల్ల ఈ ఏడాది కొంతవరకు ఇబ్బందుల నుంచి బయటపడగలిగామని వివరించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. పాలనలో మంత్రులు మరింత చురుగ్గా వ్యవహరించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రేక్షకుల్లా ఉండిపోకుండా కొత్త విషయాలు నేర్చుకుంటూ పాలనా వ్యవహారాలపై పట్టు పెంచుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత శాఖల మంత్రులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని సాధించాలని ఆదేశించారు. కేంద్రంతో సమన్వయం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన వనరులను సమీకరించుకోవాలని దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద ఒక్కో నియోజకవర్గానికి కోటి రూపాయల చొప్పున నిధులు విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. సోమ, మంగళవారాల్లో ఈ నిధులను విడుదల చేస్తామని తెలిపారు. దీంతో స్థానికంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులోకి రానున్నాయి.

# పార్టీ అభ్యర్థులకు లీగల్ సెల్ రక్షణ కవచంలా నిలవాలి

**తాడేపల్లి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు లీగల్ సెల్ రక్షణ కవచంలా, అవసరమైనప్పుడు న్యాయపరమైన ఆయుధంలా నిలవాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ లీగల్ సెల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పూడి శ్రీహరి, లీగల్ సెల్ స్టేట్ ప్రెసిడెంట్ మలసాని మనోహర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకమైన దశలోకి వెళ్తున్నాయని, పార్టీ లీగల్ సెల్ ఇక సాధారణ అనుబంధ విభాగంగా కాకుండా ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని న్యాయపరంగా పర్యవేక్షించే వ్యవస్థగా పనిచేయాలని అన్నారు. రాష్ట్రంలో చట్టాలు, నిబంధనలు, ఎన్నికల వ్యవస్థలు ఉన్నప్పటికీ అవి సక్రమంగా అమలవడం లేదని ఆయన అన్నారు. 2024 ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు, దాడులు, వేధింపులు జరిగాయని, అలాంటి పరిస్థితుల్లో లీగల్ సెల్ కార్యకర్తలకు అండగా నిలిచిందని అభినందించారు.

### ఎస్ఐఆర్ పూర్తయ్యేలోపే ఎన్నికలకు ఎందుకు తొందర?

ఎస్ఐఆర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో చనిపోయినవారి, డూప్లికేట్, అనర్హ ఓట్లు తొలగిస్తున్న పరిస్థితుల్లో, కొత్త ఓటర్ల జాబితా అందుబాటులోకి రాకముందే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం తొందరపడుతోందని సజ్జల అన్నారు. ఎస్ఐఆర్ ఫైనల్ జాబితా త్వరలోనే రావాల్సి ఉన్నప్పుడు, దానికి ముందే నోటిఫికేషన్ ఇవ్వాలనే ప్రయత్నం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారిని జాబితాలో చేర్చకుండా ఎన్నికలు నిర్వహిస్తే వారి రాజ్యాంగబద్ధ హక్కు దెబ్బతింటుందని అన్నారు.

### బీసీ రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలి

బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ నివేదికను ప్రజలకు అందుబాటులో పెట్టకుండా శాతం నిర్ణయించడం ఏ ప్రాతిపదికన జరిగిందో వెల్లడించాలని సజ్జల డిమాండ్ చేశారు. కమిషన్ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు ఆధారాలు వెల్లడించాలని అన్నారు.

### నామినేషన్ దశ నుంచే అప్రమత్తంగా ఉండాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో అసలు పోరాటం నామినేషన్ దశ నుంచే ప్రారంభమవుతుందని సజ్జల అన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు, ఎన్‌ఓసీలు, ఇతర అవసరమైన సర్టిఫికెట్లు ఇవ్వకుండా అభ్యర్థులకు ఇబ్బందులు సృష్టించే అవకాశం ఉందని, అందువల్ల ముందుగానే అన్ని డాక్యుమెంట్లు సిద్ధం చేయించాలని సూచించారు. రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాత నామినేషన్లకు చాలా తక్కువ సమయం ఉండే అవకాశం ఉన్నందున, అభ్యర్థులు, ప్రత్యామ్నాయ అభ్యర్థులు, అవసరమైన లీగల్ టీమ్‌లను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని చెప్పారు.

### గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్ నెట్‌వర్క్

ప్రతి గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో అందుబాటులో ఉండే న్యాయవాదులను మ్యాపింగ్ చేసి, వారి కాంటాక్ట్ వివరాలను కంప్యూటరైజ్ చేయాలని సజ్జల సూచించారు. గ్రామ స్థాయి అభ్యర్థికి కూడా తనకు అవసరమైనప్పుడు ఏ న్యాయవాదిని సంప్రదించాలో ముందుగానే తెలిసేలా వ్యవస్థ ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో లీగల్ వార్‌రూమ్, నియోజకవర్గ స్థాయిలో టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు, రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక సమన్వయ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడైనా సమస్య



తలెత్తితే వెంటనే జిల్లా నుంచి రాష్ట్ర కార్యాలయానికి సమాచారం చేరి, అవసరమైతే స్టేట్ ఎలక్షన్ కమిషన్, కోర్టులను ఆశ్రయించేలా వ్యవస్థ పనిచేయాలని చెప్పారు. సెన్సిటివ్ ప్రాంతాలు, నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను ముందుగానే గుర్తించి, అక్కడి పరిస్థితులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.

### స్థానిక యుద్ధానికి సిద్ధం కండి... కార్యకర్త జోలికి ఎవరైనా వస్తే...

### ప్రతి అక్రమాన్ని రికార్డు చేయాలి

ఎన్నికల సమయంలో అధికారులు, పోలీసులు లేదా ఇతరులు చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే వాటిని ఆధారాలతో నమోదు చేయాలని సజ్జల చెప్పారు. ప్రతి ఫిర్యాదు, ప్రతి ఘటన, ప్రతి అధికారిపై వచ్చిన ఆరోపణను డిజిటల్‌గా రికార్డు చేసి, అవసరమైతే లీగల్ చర్యలకు ఉపయోగించాలన్నారు. ఫీల్డ్ స్థాయి నుంచి వచ్చే సమాచారాన్ని మీడియా, సోషల్ మీడియా, లీగల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రజల ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

### పార్టీ కార్యకర్తలకు లీగల్ సెల్ అండగా నిలిచింది: పొన్నవోలు

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, గత రెండున్నరేళ్లుగా పార్టీ కార్యకర్తలు ఎదుర్కొన్న కేసులు, అరెస్టులు, వేధింపుల సమయంలో లీగల్ సెల్ వారికి భరోసాగా నిలిచిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆయన, పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టిన సందర్భాల్లో లీగల్ సెల్ వీధుల్లోనూ, కోర్టుల్లోనూ పోరాడిందన్నారు. పార్టీ కోసం కష్టకాలంలో పనిచేస్తున్న ప్రతి న్యాయవాదిని భవిష్యత్తులో పార్టీ గుర్తిస్తుందని, వారికి తగిన గౌరవం లభించేలా చూడాలని కోరారు.

### అభ్యర్థులకు న్యాయవాదులు వెన్నుముకగా నిలవాలి: చెవిరెడ్డి

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి లీగల్ సెల్ కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. కొత్తగా పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల నిబంధనలు, నామినేషన్ ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండకపోవచ్చని, అందువల్ల న్యాయవాదులు వారికి ప్రతి దశలో మార్గనిర్దేశం చేయాలని సూచించారు.

నామినేషన్ పత్రాలు నింపడం నుంచి దాఖలు చేయడం వరకు, కుల ధ్రువీకరణ పత్రాలు, నో డ్యూస్ సర్టిఫికెట్లు, ఇతర అవసరమైన పత్రాలు పొందడం వరకు లీగల్ సెల్ పూర్తి బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఏ అభ్యర్థి నామినేషన్ కూడా సాంకేతిక కారణాలతో తిరస్కరణకు గురికాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నామినేషన్‌కు సమర్పించిన పత్రాలన్నింటినీ స్కాన్ చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు డిజిటల్ రూపంలో కూడా పంపితే, తర్వాత పత్రాలు లేవని చెప్పి తిరస్కరించే పరిస్థితుల్లో ఆధారంగా ఉపయోగపడుతుందని సూచించారు. నామినేషన్ తిరస్కరణ జరిగితే వెంటనే న్యాయపరంగా స్పందించి అవసరమైతే కోర్టును ఆశ్రయించాలని చెప్పారు.

ప్రతి నియోజకవర్గంలో న్యాయ సలహా కేంద్రాలు ఏర్పాటు చేసి, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. పార్టీ అభ్యర్థులకు కేసులు, అరెస్టులతో భయపెట్టే ప్రయత్నాలు జరిగినా వారికి ధైర్యం చెప్పి, చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన బాధ్యత లీగల్ సెల్‌పై ఉందన్నారు. తాను కూడా అనేక కేసులు, జైలు జీవితం ఎదుర్కొన్న అనుభవాన్ని ప్రస్తావిస్తూ, కష్టాలను భయపడకుండా గట్టిగా నిలబడటం ద్వారానే రాజకీయంగా ఎదగగలమని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచే నాయకులే భవిష్యత్తులో మరింత ఉన్నత బాధ్యతలకు ఎదగగలరని అన్నారు. అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా దాఖలు కావడం నుంచి వారి గెలుపు వరకు న్యాయవాదులు వెన్నుముకగా నిలవాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో లీగల్ సెల్ ప్రధాన పాత్ర పోషించాలి అని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు.

### ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం: మనోహర్‌రెడ్డి

లీగల్ సెల్ స్టేట్ ప్రెసిడెంట్ మలసాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ సమావేశం సాధారణ పార్టీ సమావేశం కాదని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను పరిరక్షించే బాధ్యతతో ఏర్పాటు చేసిన సమావేశం అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ల దాఖలు, స్క్రూటినీ, పోలీస్ స్టేషన్లలో ఎదురయ్యే సమస్యలు, రౌడీ షీట్లు, బైండ్ ఓవర్ కేసులు తదితర అంశాల్లో న్యాయవాదులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.

నియోజకవర్గ కమిటీలను వెంటనే పూర్తి చేసి, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. అవసరమైన న్యాయసహాయం 24 గంటలు అందుబాటులో ఉండేలా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. లీగల్ సెల్‌లో నిజాయితీగా, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారిని ప్రోత్సహించాలని, అవకాశవాదులను దూరంగా ఉంచాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ నుంచి కౌంటింగ్ వరకు ప్రతి దశలో పార్టీ అభ్యర్థులకు పూర్తి న్యాయపరమైన రక్షణ కల్పించేందుకు లీగల్ సెల్ రాష్ట్రవ్యాప్తంగా సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## ప్రకృతి సేద్యంలో దేశంలోనే ఏపీ అగ్రస్థానం

-మొదటిపేజీ తరువాయి

సాగు విధానాలను అధ్యయనం చేసేందుకు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి సేద్యంలో గుజరాత్ కంటే ఏపీ ముందంజలో ఉందని ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ప్రశంసించారని గుర్తుచేశారు. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో రసాయన ఎరువుల వినియోగం 2.28 శాతం తగ్గిందని, దీనికి గాను కేంద్రం నుంచి రావాల్సిన రూ.218 కోట్ల ప్రోత్సాహకాల కోసం ఇప్పటికే లేఖ రాశామని చంద్రబాబు వెల్లడించారు. ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించేందుకు అనంతపురం జిల్లాలో 10 లక్షల పంట కుంటలు, చెక్ డ్యామ్‌లు తవ్వించామని, నదుల అనుసంధానంతో వర్షాభావ పరిస్థితులను కూడా అధిగమించవచ్చని అన్నారు. కషాయం, జీవామృతం తయారీకి అవసరమైన దేశీయ ఆవుల కోసం మరిన్ని గోకులాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి సేద్యాన్ని ముందుకు తీసుకెళ్తున్న రైతులే తనకు అసలైన స్ఫూర్తి అని, వారి కృషి అభినందనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## అక్టోబర్ 2028 నాటికి రాజధాని పూర్తి చేయడమే లక్ష్యం

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు 2028 అక్టోబరు నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈరోజు ఆయన రాజధాని ప్రాంతంలో పర్యటించి, ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత నెలలో వర్షాల కారణంగా పనులకు కొంత ఆటంకం కలిగిందని, ఇప్పుడు పనులు తిరిగి వేగం పుంజుకున్నాయని తెలిపారు. ఐకానిక్ టవర్ల నిర్మాణంలో మొదటి దయాగ్రిడ్ పూర్తయిందని, ప్రతి రెండు నెలలకు 6 అంతస్తుల నిర్మాణం పూర్తయ్యేలా లక్ష్యం నిర్దేశించామని వివరించారు. ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు ఫౌండేషన్ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నివాస భవనాలు తుది దశకు చేరుకున్నాయని, నవంబర్ 11 తర్వాత వాటి ప్రారంభోత్సవాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో ప్రస్తుతానికి స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నామని తెలిపారు. రాజధాని నిర్మాణంపై కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారని నారాయణ మండిపడ్డారు. విమర్శలు చేసేవారు అమరావతికి వచ్చి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూస్తే వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో 35 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పనులను వేగవంతం చేసేందుకు ప్రతి నిర్మాణ సంస్థకు స్పష్టమైన టార్గెట్లు విధించామని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ కోసం ల్యాండ్ పూలింగ్ చాలా వరకు పూర్తయిందని, డిసెంబర్ నాటికి రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించి సింగపూర్ మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతుందని వెల్లడించారు.

## పట్టిసీమ ఫలం..

## సీఎం చంద్రబాబుకు కృష్ణా డెల్టా రైతుల కృతజ్ఞతలు

**పట్టిసీమ ద్వారా నీరందించిన సీఎం చంద్రబాబును కలిసిన కృష్ణా డెల్టా రైతులు**

**చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్' అంటూ శాలువాతో సత్కరించిన రైతులు**

**పట్టిసీమతో 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి నీటిని కృష్ణాకు తరలించామన్న సీఎం**

**పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమకు ఇచ్చామని వెల్లడి**

**ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ**



పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు జల భరోసా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి డెల్టా రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి సీఎంను కలిసిన రైతులు.. ఆయనను శాలువాతో సత్కరించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్'గా, 'జలప్రదాత'గా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పట్టిసీమ ద్వారా గోదావరి వరద నీటిని కృష్ణా డెల్టాకు తరలించి, అదే సమయంలో శ్రీశైలంలో పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమకు అందించి అన్ని ప్రాంతాలకు న్యాయం చేశారని కొనియాడారు. కేవలం చంద్రబాబు ముందుచూపుతోనే ఇది సాధ్యమైందని, ఆయన కృషితోనే కృష్ణా డెల్టా సస్యశ్యామలమైందని అన్నారు. పట్టిసీమ ద్వారా ఇప్పటివరకు సుమారు 500 టీఎంసీల నీటిని తమ ప్రాంతానికి అందించడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. రైతుల అభినందనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ, వారికి ధన్యవాదాలు తెలిపారు. పట్టిసీమ ద్వారా వచ్చిన నీటితో కృష్ణా డెల్టాలో సిరులు పండించిన రైతుల కృషిని ఆయన అభినందించారు. "పట్టిసీమ లిఫ్ట్ ద్వారా గత 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి వరద నీటిని కృష్ణా బేసిన్‌కు విజయవంతంగా తరలించాం. ఈ ప్రాజెక్టుతో సాధించిన జలవిజయం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఈ ఆలోచన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం డెల్టా రైతుల కష్టాలు తీర్చి, సంపద సృష్టించడమే," అని సీఎం వివరించారు. పట్టిసీమ విజయంతో రెండు ప్రాంతాలకు మేలు జరిగిందని చంద్రబాబు తెలిపారు. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లో వినియోగించుకోవడం ద్వారా పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమలోని సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించగలిగామని చెప్పారు. దీనివల్లే రాయలసీమలో 'కియా' వంటి ప్రతిష్ఠాత్మక పరిశ్రమలకు కూడా నీటిని అందించడం సాధ్యమైందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంపూర్ణ జల భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇరిగేషన్ క్యాలెండర్‌ను పక్కాగా అమలు చేసి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

## టీడీపీ సీనియర్ నాయకుడు కృష్ణ మేస్త్రి మృతికి ఎమ్మెల్యే అమర్ సంతాపం

**పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివి.. కుటుంబానికి అండగా ఉంటాం**

**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 10:**



పలమనేరు పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కృష్ణ మేస్త్రి మృతి పట్ల పలమనేరు ఎమ్మెల్యే ఎన్. అమరనాథ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన కృష్ణ మేస్త్రి ఆసుపత్రిలో చికిత్స పొందు తూ శు క్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి టీడీపీ నాయకులతో కలిసి కృష్ణ మేస్త్రి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ తరఫున కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ ఆవిర్భావం నుంచి కృష్ణ మేస్త్రి పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పార్టీకి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని, సీనియర్ నాయకుడిని కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంతాప కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్.వి. బాలాజీ, బ్రహ్మయ్య, ఆర్బీసీ కుట్టి, గిరిబాబు, కృష్ణమూర్తి గౌడు, నాగరాజు, ఖాజా, మదన్, రమేష్, కోటి, అఫ్రోజ్, నదీమ్, చెన్న రాయప్ప, సుధాకర్, సురేష్, వీరప్ప, శ్రీనివాసులు, మోహన్, రామూర్తి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణముఖి నది తీరంలో కర్మక్రియల మండపాన్ని అభివృద్ధి చేయాలి

●మహాలయ అమావాస్య సందర్భంగా భక్తుల ఇబ్బందులు..

●బీజేపీ సీనియర్ నాయకుడు గరికపాటి రమేష్ బాబు వినతి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 10:**

శ్రీకాళహస్తి పట్టణంలోని దక్షిణ కాశీగా పేరు గాంచిన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని స్వర్ణముఖి నది తీరాన ఉన్న కర్మక్రియల మండపాన్ని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు గరికపాటి రమేష్ బాబు సంబంధిత అధికారులను కోరారు. మహాలయ అమావాస్య సందర్భంగా పితృదేవతలకు తర్పణాలు, పిండప్రదానాలు నిర్వహిం చేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ప్రస్తుత మండపం సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన పేర్కొన్నారు. మహాలయ అమావాస్యను పురస్కరించుకుని శనివారం శ్రీకాళహస్తి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలు, ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వర్ణముఖి నది తీరంలో పితృదేవతలకు తర్పణాలు,పిండప్రదానాలు, బ్రాహ్మణులకు దానధర్మాలు నిర్వహించారు. అయితే,ఎన్నో సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన కర్మక్రియల మండపం భక్తుల సంఖ్యకు సరిపోకపోవడంతో పలువురు నది ఒడ్డునే మండుటెండలో గొడుగులు వేసుకుని పితృకార్యాలు నిర్వహించాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గరికపాటి రమేష్ బాబు మాట్లాడుతూ, హిందూ సంప్రదాయం ప్రకారం భాద్రపద మాసంలో వచ్చే మహాలయ పక్షాలు పితృదేవతలకు తర్పణాలు, పిండప్రదానాలు సమర్పిం చేందుకు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని తెలిపారు. పితృదేవతలు మరణించిన తిథిని అనుసరించి మహాల య పక్షాల్లో ఆయా రోజుల్లో పితృకార్యాలు నిర్వహిస్తారని, తిథి తెలియని వారు మహాలయ అమావాస్య రోజున ఈ కార్యక్రమాలు చేపడతారని వివరించారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రా నికి ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పితృకార్యాలు నిర్వహిస్తుంటారని, ముఖ్యంగా మహాలయ అమావాస్య, సంక్రాంతి వంటి పర్వదినాల్లో భక్తుల రద్దీ గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భక్తుల అవసరాలకు అనుగుణంగా కర్మక్రియల మండపాన్ని విస్తరించి, తగిన నీటి సౌకర్యం, నీడ, కూర్చునే ఏర్పాట్లు, పరిశుభ్రత, ఇతర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. స్వర్ణముఖి నది పవిత్రతను కాపాడు తూ, పితృకార్యాల కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని గరికపాటి రమేష్ బాబు విజ్ఞప్తి చేశారు.

# ఎస్టీ కాలనీలో రూ.30 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 10:**

శ్రీకాళహస్తి పట్టణంలోని 33వ వార్డు పరిధిలో ఉన్న ఎస్టీ కాలనీలో సుమారు రూ.30 లక్షల అంచనా వ్యయంతో నూతన మురుగునీటి కాలువ (డ్రైనేజీ) నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ నిర్వహించారు. గౌరవ శాసనసభ్యులు శ్రీ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షుడు జి. విజయ్ కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కంట రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది.ఎన్నో సంవత్సరాలుగా సరైన డ్రైనేజీ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎస్టీ కాలనీవాసుల సమస్యను గుర్తించి, నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తమ కాలనీలో మురుగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, కాసరం రమేష్, యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్ముగం, హరి, పోలూరు శ్రీనివాసరెడ్డి, రాకేష్, కన్నవరం హరిబాబు, సునీల్, షణ్ముగం, ఎమ్మెస్ రెడ్డి, మున్సిపల్ డీఈ, ఏఈతో పాటు మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# వి.కోటలో వైభవంగా 15వ దేవీ నవరాత్రి ఉత్సవాలు

●దుర్గాష్టమి రోజున 3,116 పాల కలశాలతో అమ్మవారికి అభిషేకం

●మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసులు.



**వి.కోట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 10:**

వి.కోట మండలంలో 15వ దేవీ నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిం చేందుకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక దుర్గా కళ్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసులు మాటా ్లడుతూ, నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులు, ప్రజలు సహకరిం చాలని కోరారు. ఆలయ ధర్మకర్త రఘుపతి నాయుడు మాట్లాడుతూ.., భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. డాక్టర్ ఎస్.ఆర్.దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఉత్సవాలను ఈసారి కూడా అమ్మవారి వివిధ అలంకరణలు, ప్రత్యేక పూజలతో ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడిం చారు. దుర్గాష్టమి సందర్భంగా 3,116 పాల కలశాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. వి.కోట మండలంతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అమ్మవారి ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కాగా, కమిటీ పూర్వ కార్యదర్శి జగన్ మోహన్ రెడ్డి అకాల మృతికి సమావేశంలో సభ్యులు ఒక నిమిషం మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# శివునికుప్పం వద్ద ప్రభుత్వ భూమిపై నిర్మాణం?

●గతంలో ఫిర్యాదు చేసినట్లు స్థానికుల వెల్లడి..

●పరిశీలించి స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి



**వి.కోట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్10:**

వి.కోట మండలం శివునికుప్పం రెవెన్యూ పరిధిలోని జీడిగుడ్ల వద్ద భూమికి సంబంధించి స్థానికంగా చర్చ జరుగుతోంది. అక్కడ ప్రభుత్వ భూమిగా భావిస్తున్న స్థలంలో టెంట్ ఏర్పాటు చేసి, ప్రస్తుతం షెడ్డు నిర్మాణం చేపట్టినట్లు కొందరు స్థానికులు చెబుతున్నారు. అయితే, సదరు స్థలం ప్రభుత్వ భూమేనా? నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. ఈ విషయంపై గతంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఫిర్యాదుపై అధికారులు తీసుకున్న చర్యల వివరాలు తమకు తెలియలేదని వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్థలాన్ని పరిశీలించి వాస్తవ పరిస్థితిని వెల్లడించాలని కోరుతున్నారు.

**స్థలంపై స్పష్టత ఇవ్వాలి**

సదరు స్థలం రెవెన్యూ రికార్డుల ప్రకారం ఎవరి పరిధిలో ఉంది? అక్కడ నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై స్పష్టత అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. భూమి స్వరూపం, హద్దులు, యాజమాన్య వివరాలను అధికారిక రికార్డుల ఆధారంగా పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**అధికారుల పరిశీలనపై ఎదురుచూపులు**

ప్రభుత్వ భూములకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి సందేహాలకు తావులేకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని స్థానికులు కోరుతున్నారు. స్థలం ప్రభుత్వ భూమిగా నిర్ధారణ అయితే, అక్కడ చేపట్టిన నిర్మాణాలకు సంబంధించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత రెవెన్యూ అధికారుల వివరణ అందాల్సి ఉంది. అధికారిక పరిశీలన అనంతరం స్థలానికి సంబంధించిన వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# రాళ్లబుదుగూరులో చారిత్రక కోదండరామయ్య ఆలయానికి పూర్వ వైభవం!

●రూ.7.75 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం..

●సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యం

●ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్





**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 10:**

కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం రాళ్లబుదుగూరు గ్రామంలోని సుమారు 500 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ కోదండరామయ్య స్వామి వారి ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,తెలిపారు. రూ.7.75 కోట్ల వ్యయంతో చేపట్టిన ఆలయ పునర్నిర్మాణ పనులను ఆయన సందర్శించి, పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో చారిత్రక ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమం చేపట్టడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ ఆలయం కేవలం భక్తి విశ్వాసాలకు ప్రతీక మాత్రమే కాకుండా, మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ఆలయ పునర్నిర్మాణంతో చారిత్రక ప్రాశస్త్యాన్ని కాపాడటంతో పాటు, భావితరాలకు మన గొప్ప వారసత్వాన్ని అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

**సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేయాలి**

రానున్న సంక్రాంతి పండుగ నాటికి ఆలయ పునర్నిర్మాణ పనులను పూర్తి చేయాలనే లక్ష్యంతో సంబంధిత అధికారులు కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ మహత్తర కార్యక్రమంలో సీఎం వ్యక్తిగత కార్యదర్శి శ్రీకాంత్, స్థానిక టిడిపి నాయకులు భాగస్వాములవుతున్న అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పునర్నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం శ్రీ కోదండరామయ్య స్వామి వారి ఆలయం నూతన శోభను సంతరించుకుని భక్తులను ఆకట్టుకోవాలని ఆయన ఆకాంక్షించారు. స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. చారిత్రక ఆలయానికి పునర్వైభవం తీసుకొచ్చే దిశగా జరుగుతున్న ఈ పునర్నిర్మాణ పనులతో రాళ్లబుదుగూరు గ్రామానికి ఆధ్యాత్మిక గుర్తింపు మరింత పెరగనుంది.

# దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి ఆహ్వానం

**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 10:**



పుంగనూరు మండల కేంద్రంలో ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు వైభవంగా నిర్వహించ నున్న దేవీ నవరాత్రి మహోత్సవాలకు హాజరు కావాలని పలమనేరు ఎమ్మెల్యే ఎన్. అమరనాథరెడ్డిని పుంగనూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు శనివారం పలమనేరులో కలిసి ఆహ్వానించారు. ఏటా భక్తిశ్రద్ధలతో నిర్వహించే నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శిం చుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. దీనికి స్పందించిన అమరనాథరెడ్డి ఉత్సవాలకు తప్పకుండా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజల్లో పాల్గొంటానని తెలి పారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు జనసేన పార్టీ పీఓసీ ఇన్‌చార్జి చిన్నా రాయల్, ఎన్‌వీఆర్ ట్రస్ట్ అధినేత వేణుగోపాల్ రెడ్డి, శంకర్ రెడ్డి, రమణారెడ్డి, రోహిత్, నాగరాజు రెడ్డితో పాటు పలమనేరు జనసేన నాయకులు పూల చైతన్య, నాగరాజు, మురాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరిమాని గంగమ్మ తల్లి దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం!

●భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి వేడుకలు..

●భక్తులకు అన్నదాన కార్యక్రమం



**ఎస్.ఆర్.పురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 10:**

తయ్యూరు పాయకట్టు ఇలవేల్పు శ్రీ ఆరిమాని గంగమ్మ తల్లి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ విషయాన్ని ఆలయ చైర్మన్ జలంధర్ నాయుడు, వైస్ చైర్మన్ వెంకటరామయ్య, ఈఓ వెంకటరాయలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోమవారం ఉదయం అంకురార్పణ, అఖండ దీప ప్రతిష్ఠతో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం అమ్మవారి ఊరేగింపు, రాత్రి వీధి నాటకంతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. తయ్యూరు పాయకట్టు ప్రాంత ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని ఆరిమాని గంగమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

**పటిష్ట పోలీసు బందోబస్తు** : దసరా ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

# పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి భరోసా

**వెండుగంపల్లిలో ముగ్గురు లబ్ధిదారులకు రూ.2.78 లక్షల చెక్కుల పంపిణీ**



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్10:**

పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించి, ఆపద సమయంలో అండగా నిలవడమే ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) లక్ష్యమని ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, పీకేఎం–ఉడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్.సురేష్ బాబు పేర్కొన్నారు. కుప్పం మండలం వెండుగంపల్లి గ్రామ పంచాయతీలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను వారు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాయప్ప (గంగలక్ష్మి)కు రూ.1,67,921, కర్ణుడుకు రూ.70,122, సి. మునెప్పకు రూ.40,564 విలువైన చెక్కులను అందజేశారు. ముగ్గురు లబ్ధిదారులకు కలిపి మొత్తం రూ.2,78,607 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ వైద్య చికిత్సల కోసం ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో తోడ్పాటునందిస్తోందని నాయకులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

# కుప్పంలో టీడీపీ బలోపేతానికి సమష్టి కృషి చేయాలి

**సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయాలి.. స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం**



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్10:**

నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం రూరల్ మండలంలోని వెండు గంపల్లి, నడుమూరు గ్రామ పంచాయతీల్లో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, పీకేఎం–ఉడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్. సురేష్ బాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని నాయకులు సూచించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ప్రతిపక్షాల ప్రచారానికి వాస్తవాల ఆధారంగా సమాధానమిస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈకార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

చదవండి..
చదివించండి
చిత్తూరు ఎక్స్‌ప్రెస్

Edited Printed Published & Owned by K.L Krishnam Raju. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 19/86-1, Jaya Prakash Road, Kuppam, Chittoor District, Andhra pradesh. EDITOR K.L.KRISHNAM RAJU, RNI. NO. APTEL/2023/86143